క్లుప్తంగా

భీష్మ ఏకాదశికి ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: దొండపర్తిలో గల శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. శనివారం ఉదయం 6 గంటలకు ప్రారంభమై ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఆలయం ఆవరణలో సంకీర్తనలు, భక్తిగీతాలాపన జరగనున్నట్లు ఈవో రమాబాయి తెలిపారు. అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు.

ముగిసిన ఫిల్మ్ ఫెస్టివల్



మాట్లాడుతున్న సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్ శుక్రవారం ఘనంగా ముగిసింది. ముగింపు సందర్భంగా నా ఆటోగ్రాఫ్ సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ తెలుగు సినిమా దినోత్సవాన్ని 24 క్రాఫ్ట్స్‌కు చెందిన వారు, సంస్థలు, ప్రభుత్వం కలిసి పెద్ద ఎత్తున జరపాలన్నారు. పరిశ్రమ అభివృద్ధికి దోహదపడిన వారిని గుర్తు చేసుకోవాలని సూచించారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు వచ్చే ఏడాది నుంచి ఘనంగా జరుపుతామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, చాట్ల బాబూరావు, బాబ్జి, సుధాకర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జాము సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

అలరించిన జోషిత కవర్ సాంగ్



కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య జీఎస్ఎన్ రాజు, డాక్టర్ చిట్టిబాబు తదితరులు


సీతమ్మధార: జోషిత క్రియేషన్స్ బ్యానర్‌పై అరుణ భాస్కర్ సమర్పించిన జోషిత కవర్ సాంగ్‌ను శుక్రవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో సెంచూరియన్ యూనివర్సిటీ చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజు, స్టీల్‌ప్లాంట్ జీఎం డాక్టర్ వి. చిట్టిబాబు ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉమా భూషణ్, జ్యోతి రంగారావు, లీలా కుమారి, యోగ భాస్కర్ పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా కోరుకొండ రంగారావు వ్యవహరించారు. దుర్గాప్రసాద్, జోషిత, రంగారావు స్కిట్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్టాండప్ కామెడీ కోరుకొండ రంగారావు, మధు అండ్ టీం వెస్టర్న్ డాన్స్ నాగ భాస్కర్, అనురాధ, భయ్యా శ్రీనివాస్, ఫణిస్వామి, చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కల సాకారం

- కొండవాలు ప్రాంత రహదారులకు మహర్దశ
- కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని రోడ్లు
- గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులు
- డ్రైనేజీలు, రోడ్లు ఆధునికీకరిస్తున్న జీవీఎంసీ అధికారులు



వరాహగిరి కాలనీలో పూర్తయిన సీసీ రోడ్డు



సత్యసాయినగర్‌లో కొత్తగా నిర్మించిన డ్రైనేజీలు



వరాహగిరి కాలనీలో పూర్తయిన డ్రైనేజీలు, శ్లాబులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు పరిధిలో గల కొండవాలు ప్రాంతాల్లో దశాబ్దాలుగా రోడ్లు వేయలేదు. డ్రైనేజీలు అభివృద్ధికి నోచుకోలేదు. సంవత్సరాలు గడచినా, జనాభా అధికమైనా, నివాసాలు పెరిగినా అవే ఇరుకురోడ్లు, శిథిలమైన డ్రైనేజీలతోనే స్థానికులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. కానీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు రెండేళ్లు కరోనా కబళించింది. తదనంతరం వచ్చిన జీవీఎంసీ ఎన్నికల్లో గెలిచిన కార్పొరేటర్ పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించారు. దీంతో కౌన్సిల్ ఏర్పాటైన తర్వాత జీవీఎంసీ వార్డుల అభివృద్ధికి ఏటా సుమారు కోటి రూపాయలు కేటాయించింది. ఇలా అప్పట్లో రెండేళ్లు మంజూరైన నిధులతో వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ముఖ్యంగా వార్డు పరిధి.. భీమిలి నియోజకవర్గం పరిధిలో గల సత్యసాయినగర్, వరాహగిరికాలనీ-1,2, గణేష్‌నగర్ ప్రాంతాల్లో నాటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ కంపా హనోకు వార్డుల్లో పర్యటించి, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డుకు అవసరమైన పనులు చేయించారు. ఆ పనులకు శంకుస్థాపనలు చేశారు. కానీ వెంటనే సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో పనులు ముందుకు సాగలేదు. అప్పుడు మంజూరైన పనుల్లో ఇటీవల అధిక శాతం పనులు పూర్తి చేశారు. దీంతో స్థానికులు హర్షం

మారిన స్థితిగతులు

సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ-1,2 ప్రాంతాల్లో శిథిలమైన రోడ్లు, డ్రైనేజీలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రమాదాల బారిన కూడా పడేవారు. కానీ ఇటీవల రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేయడంతో వార్డులోని ప్రాంతాలు విశాలంగా, సుందరంగా కనిపిస్తున్నాయి. రోడ్లు, డ్రైనేజీలు, కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలపై శ్లాబులు ఏర్పాటు చేశారు.

పని చేయని బోరుతో అవస్థలు



నక్కవానిపాలెంలో పని చేయని బోరు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో కొన్ని బోర్లు వేసవి రాకుండానే ఎండిపోవడం గమనార్హం. ఇక్కడ నక్కవానిపాలెం రోడ్డులో దుర్గాదేవి ఆలయం వెనుక భాగంలో గల ఒక బోరు కొన్ని సంవత్సరాలుగా పని చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడి 13వ నంబర్ గల బోరు పని చేయకపోవడంతో ఇక్కడి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్థానికుల మంచి నీటి అవసరాలకు ఈ బోరుబావే ఆధారం. కానీ చాలా కాలంగా ఇది పని చేయకపోవడంతో మంచినీటి కోసం దూరంగా ఉన్న బోరు వద్దకు వెళ్లాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బోరు పని చేయని కారణంగా ఇక్కడే చెత్తా చెదారాలు పేరుకుపోతున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. వేసవి రాకముందే అధికారులు స్పందించి ఈ బోరుకి మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్-3 నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

గర్భిణులకు కార్డుల పంపిణీ

అల్లిపురం: గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకుని, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని అంగన్‌వాడీ టీచర్ వల్లీ, ఆశ వర్కర్ లీలావతి సూచించారు. ప్రకాశరావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు సలహాలు, సూచనలు అందజేశారు. వారికి మాతా, శిశు సంరక్షణ కార్డులు అందజేశారు. ప్రతి నెల క్రమం తప్పకుండా మందులు వాడాలని, పోషకాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. బాలింతలు బిడ్డలకు ముర్రుపాలు అందించాలన్నారు.

వెట్టి చాకిరీ నిర్మూలిద్దాం



మహారాణి పార్లర్ కూడలిలో విద్యార్థుల మానవహారం



కార్యక్రమంలో జేసీఎల్ రామారావు, డీసీఎల్ సునీత తదితరులు

సీతంపేట: వెట్టి చాకిరీ, కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావు అన్నారు. వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో గల కార్మిక శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు కార్మిక శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. కార్మిక శాఖ కార్యాలయం నుంచి మహారాణి పార్లర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారం చేపట్టారు. వెట్టి చాకిరీ నిర్మూలన, శిశు హక్కుల పరిరక్షణపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత, ఏసీఎల్‌లు గోవిందు, రాజు, సహాయ కార్మిక అధికారులు, జిల్లా న్యాయ సేవా సమితి, ఐజేఎం, నేచర్, సీఈఎఫ్‌హెచ్‌ఏ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్డీలు ఇలా.. రాకపోకలు ఎలా?



గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన బడ్డీలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో ఇష్టానుసారంగా బడ్డీలు ఏర్పాటు చేస్తున్నా టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇక్కడి గాంధీనగర్‌లో గల మూడు గుళ్ల ప్రాంతంలో గుళ్లకు అడ్డంగా ఏకంగా ఒకేసారి ఆరు బడ్డీలు ఏర్పాటు చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. మెయిన్ రోడ్డులో వెళ్లే పాదచారులు, వాహన చోదకులు ఈ గుళ్లను సమీపించిన తర్వాత కొద్ది సేపు ఆగి ఇక్కడి ముత్యాలమ్మ తదితర అమ్మవార్లకు నమస్కరించి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో రోడ్డు మీదకి గుళ్ల కనిపించకుండా బడ్డీలు ఏర్పాటు చేయడంతో గుడికి వెళ్లే భక్తులు కూడా తీవ్ర అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామ ఇలవేల్పు గుడికి వెళ్లే మార్గంలో అక్రమంగా బడ్డీలు ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జోన్-3 టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో బడ్డీలు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గెడ్డలో వ్యర్థాలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..



గెడ్డలో వ్యర్థాలు తొలగించక ముందు (నాడు)



వ్యర్థాలు తొలగించిన తర్వాత (నేడు)

సీతంపేట: ఎట్టకేలకు గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించారు. జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం చోటీ బస్తీ పక్కన గల గెడ్డలో చెత్తా, చెదారం, వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సమస్యపై 'గెడ్డల్లో భారీగా వ్యర్థాలు' శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ జోన్-3 అధికారులు స్పందించారు. వారి ఆదేశాలతో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిహారిక, సూపర్‌వైజర్ భూషణ్ పర్యవేక్షణలో సిబ్బంది జేసీబీతో గెడ్డలో పేరుపోయిన వ్యర్థాలు తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్లీపేట పాఠశాలకు సామగ్రి వితరణ



సామగ్రిని ప్రారంభిస్తున్న జీఎం దాస్, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు



విద్యార్థులతో బ్యాంక్ సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ సిరిపురం బ్రాంచ్ సౌజన్యంతో బీరువాలు, లాకర్ కబోర్డులు, ఫ్యాన్లు అందజేశారు. ఈ మేరకు ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ కె. దాస్, డీజీఎం ఎస్.అజయ్‌కుమార్ శేషాద్రి శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనివాసరావుకు అందజేశారు. సుమారు 27 ఫ్యాన్లు, 5 కబోర్డులు, బీరువా వితరణ చేశారు. జీఎం దాస్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఆంగ్లం మాట్లాడిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

బాలికకు న్యాయం చేయాలని ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు తదితరులు

సీతమ్మధార: సింహాద్రిపురంలో నివాసం ఉంటున్న జీవీఎంసీ క్లాప్ డ్రైవర్ కుమార్తెపై లైంగిక దాడి జరిగిన ఘటనను నిరసిస్తూ జీవీఎంసీ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో ప్రదర్శన నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పి.మణి మాట్లాడుతూ ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర హోం మంత్రి స్పందించాలని, బాధిత బాలికకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మద్యం, డ్రగ్స్, నీలి చిత్రాలు, సాహిత్యాన్ని అరికట్టాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే నిందితునికి కఠిన శిక్ష వేయాలన్నారు. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, అధ్యక్షుడు టి. నూకరాజు, జె.ఆర్. నాయుడు, అనిల్, సురేష్ ఈ. ఆదినారాయణ, శ్రావణ్, కె. కుమారి, హేమలత, కొండమ్మ, అనిత, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీలెఫ్ట్ మార్గంలో సిమెంట్ దిమ్మల ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

సత్యం జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలు

సీతమ్మధార: 'సాక్షి' దినపత్రికలో 6వ తేదీన 'సిగ్నల్ అటు.. వాహనాలన్నీ ఇటు' శీర్షికన వెలువడిన వార్తకు స్పందించిన ట్రాఫిక్ పోలీసులు తక్షణమే చర్యలు చేపట్టారు. సత్యం జంక్షన్ సిగ్నల్స్ వద్ద విచిత్రమైన సమస్య ఎదురవుతోంది. ఈ జంక్షన్‌లో నాలుగు వైపులా ఫ్రీలెఫ్ట్ మార్గంలో కూడా వాహనాలు పార్కింగ్ చేయడంతో వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ జంక్షన్ త్రీటౌన్, ఎంవీపీ, ద్వారకా స్టేషన్ల పరిధిలో ఉంది. కాగా సీతమ్మధార నుంచి సత్యం జంక్షన్ మీదుగా మద్దిలపాలెం వైపు వెళ్లే వాహన చోదకులు ఫ్రీలెఫ్ట్ మార్గంలో వెళ్లలేకపోతున్నారు. ఎందుకంటే బుల్లయ్య కళాశాల వైపు వెళ్లే వాహన చోదకులు ఫ్రీలెఫ్ట్ మార్గంలో ఆగి సిగ్నల్ కోసం వేచి చూస్తుంటారు. ఫలితంగా మద్దిలపాలెం వైపు వెళ్లాల్సిన వాహన చోదకులు ఫ్రీ లెఫ్ట్ మార్గంలో దారి లేక గ్రీన్‌సిగ్నల్ పడే వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. గురుద్వారా నుంచి సత్యం జంక్షన్ మీదుగా సీతమ్మధార వైపు వెళ్లే వాహన చోదకులకు కూడా ఇదే సమస్య ఎదురు కావడం గమనార్హం. ఇక్కడ కూడా ఫ్రీ లెఫ్ట్ మార్గంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు అధిక సంఖ్యలో ఆపేస్తుంటారు. సాక్షి చొరవతో ఈ సమస్య పరిష్కారం కావడంతో వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

రేపు డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి

మహారాణిపేట: ప్రసిద్ధ హేతువాది, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి. శ్రీరామమూర్తి, జె. రవి తెలిపారు. శుక్రవారం ఆరిలోవలో ఉన్న కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జయగోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాల్యం నుంచి సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలను వ్యతిరేకించిన జయగోపాల్ అంతర్జాతీయ స్థాయి నాయకులని, ఆయన చేసిన సేవలకు అనేక సంస్థలు అవార్డులు కూడా ఇచ్చాయన్నారు. ఈ వర్ధంతి సభకు ముఖ్య అతిథులుగా రైటర్స్ అకాడమీ చైర్మన్, ఉత్తరాంధ్ర సంస్థ కన్వీనర్, లీడర్ దినపత్రిక ఎడిటర్ రమణమూర్తి, ప్రముఖ విప్లవ కవి కుమారుడు ఉదయ్ భాస్కర్ హాజరవుతారని తెలిపారు.

అరుణాచలంలో వివేకానంద సంస్థ సేవలు



సాధువులకు అల్పాహారం అందజేస్తున్న సంస్థ అధ్యక్షుడు అప్పారావు

దాబాగార్డెన్స్: పాతనగరానికి చెందిన స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం అరుణాచలం పుణ్యక్షేత్రం వాయులింగం సమీపంలో పలువురు సాధువులకు అల్పాహారం అందజేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ వివేకానంద సంస్థ నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సంస్థ దర్శించుకుంటున్న అన్ని పుణ్యక్షేత్రాల్లో నారాయణ సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీరామ్, రమాప్రియ, జనని తదితరులు పాల్గొన్నారు

నేడు శివపార్వతుల కల్యాణ మహోత్సవం



గణేష్ పార్వతి సమేత ఓంకార శివాలయం, ఓం సాయిబాబా మందిరం

దాబాగార్డెన్స్: గొల్లలపాలెంలోని సింగ్ హోటల్ జంక్షన్, శివాలయం వీధిలో వేంచేసిన గణేష్ పార్వతీ సమేత శ్రీ ఓంకార శివాలయం, ఓం సాయిబాబా (షిర్డీ) మందిరంలో శనివారం శివ పార్వతుల 30వ కల్యాణ మహోత్సవం, ఓం సాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఓంకార శివసాయి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 10.05 గంటలకు శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు నారాయణ సేవ, సాయంత్రం 6 గంటలకు పల్లకీ సేవ(తిరువీధి ఉత్సవం) జరపనున్నట్లు తెలిపారు. కల్యాణం చేయించుకునే దంపతులకు స్వామి శేషవస్త్రం అందజేయనున్నట్లు చెప్పారు. కల్యాణం చేయించుకునే దంపతులు 8978802451 నంబరులో సంప్రదించాలన్నారు.